## లాక్‌డౌన్ పాటిస్తే కరోనాను తరిమి కొడతాం

**-ప్రజలకు పిలుపునిచ్చిన కేంద్రమంత్రి హర్షవర్ధన్**

న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): కరోనా నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. త్వరలోనే కరోనాను నియంత్రిస్తామన్నారు. అయితే అందరూ కూడా లాక్‌డౌన్‌ను పాటించాలని సూచించారు. భౌతిక దూరం పాటిస్తూ అందరూ ఇళ్లల్లోనే ఉండాలని కోరారు. అటు కరోనాపై పోరులో వైద్యబృందం అద్భుతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. లాక్‌డౌన్ పాటిస్తేనే కరోనాను తరిమికొట్టగలమని కేంద్రమంత్రి హర్షవర్ధన్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 2,593కి చేరింది. 78 మంది మృతిచెందగా..179 మంది బాధితులు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. దేశంలో కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు 2,088 మందికి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.గడిచిన 24 గంటల్లో 336 కొత్త కేసులు నమోదు కాగా 3 మరణించారు.



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 4-4-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:26 | సంచిక: 214 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# ఆదివారం రాత్రి ఇళ్లముందు జ్యోతుల వెలగించండి

**9 నిముషాలపాటు లైట్లు ఆర్పేసి జ్యోతిప్రజ్వలన చేయాలి**

**కరోనాపై పోరులో భారత ప్రజల ఐక్యతను చాటాలి**

**జాతి ఐక్యతను ప్రకటించాలంటూ ప్రజలకు ప్రధాని మోడీ వీడియో సందేశం**

**ప్రజలను జాగృతం చేయాలంటూ క్రీడాకారులకు పిలుపు**



న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): కరోనాపై పోరులో భాగంగా వచ్చే ఆదివారం అంటే ఈ నెల 5న రాత్రి 9గంటలకు దేశవ్యాప్తంగా జ్యోతి ప్రజ్వలన చేయాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ప్రజలంతా లైట్లను ఆర్పేసి తమ గుమ్మాల ముందు క్యాండిల్స్ వెలిగించాలన్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ముందుగా ప్రకటించినట్టుగానే సరిగ్గా ఉదయం 9 గంటలకు ఆయన ట్విటర్ వేదికగా ఈ వీడియో షేర్ చేసుకున్నారు. కరోనా మహమ్మారిపై పోరాటానికి కలిసి నడుస్తున్న దేశ ప్రజలకు ప్రధాని మోడీ ఈ సందర్భంగా ధన్యావాదాలు తెలిపారు. కొవిడ్–19పై భారత్ చేస్తున్న పోరాటాన్ని చాలా దేశాలు అనుసరిస్తున్నాయన్నారు. జనతా కర్ఫ్యూతో దేశ ప్రజలు తమ సామర్థ్యాన్ని చాటారని కొనియాడారు. దేశ ప్రజలంతా ఒక్కటిగా నిలిచి కరోనాను జయించాలని పేర్కొన్నారు. ఐక్యంగా పోరాడితేనే విజయం సాధిస్తామనీ.. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఉంటే కరోనాను జయించినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలు ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని మోడీ పేర్కొన్నారు. కరోనా మహమ్మారిని జయించేందుకు రాబోయే ఐదు రోజులు అత్యంత కీలకమని ఆయన గుర్తుచేశారు. కాగా కరోనాపై విజయం సాధించేందుకు దేశ ప్రజలంతా మరోసారి సంకల్పం చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 5న ఆదివారం రాత్రి కరోనా చీకట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఆరోజు రాత్రి 9 గంటలకు 9 నిమిషాల పాటు లైట్లు ఆర్పేయాలన్నారు. ఎవరెక్కడున్నా లైట్లు ఆర్పేసి దీపాలు వెలిగించాలని ప్రధాని కోరారు. ఈ సందర్భంగా సామాజిక దూరం పాటించాలని కోరారు. విద్యుత్ లైట్లన్నీ ఆర్పివేసి కొవ్వొత్తి, దీపం లేదా మొబైల్ ఫ్లాష్ లైట్ వెలిగించాలన్నారు. తద్వారా దేశంలోని 130 కోట్ల మంది ప్రజలు మరోసారి కరోనాను పారదోలేందుకు తమ సంకల్పం చాటాలని ప్రధాని కోరారు. ప్రజలు వెలిగించే దీపాలు కరోనాపై పోరాడే వైద్యులు, అత్యవసర సేవల సిబ్బందిలో మరింత స్ఫూర్తి నింపాలని ఆకాంక్షించారు. 130 కోట్ల మంది ప్రజల సామూహిక శక్తి.. ప్రతి ఒక్కరిలో కనిపించింద న్నారు. దేశమంతా ఒక్కటై కరోనాపై పోరాటం చేసిందన్నారు. ఏప్రిల్ 5వ తేదీన.. 130 కోట్ల మంది ప్రజలు మహాశక్తి జాగరణ చేయాలన్నారు. దేశ ప్రజలు మహాసంకల్పాన్ని ప్రదర్శించాలన్నారు. ఆ రోజు రాత్రి 9 గంటలకు ప్రతి ఒక్కరూ ఇంట్లో లైట్లు బంద్ చేసి.. దీపాలను వెలిగించాలన్నారు. కేవలం 9 నిమిషాల సమయాన్ని కేటాయించాలన్నారు. టార్చ్‌లైట్ అయినా.. దీపం అయినా వెలిగించాలన్నారు. ఆ ప్రకాశంతో అంధకారాన్ని పారద్రోలాలన్నారు. మేం ఒంటరిగా లేమన్న సందేశాన్ని వినిపించాలన్నారు. ఎవరూ కూడా రోడ్లపై వెళ్లకూ డదన్నారు. సామాజిక దూరాన్ని ఎప్పుడూ ఉల్లంఘించకూడదన్నారు. కరోనా సైకిల్‌ను బ్రేక్ చేసేందుకు ఇదొక్కటే మార్గమని ప్రధాని తెలిపారు. 5వ తేదీన ఒంటరిగా కూర్చుని మహాభారతాన్ని గుర్తు చేసుకోండన్నారు. 130 కోట్ల ప్రజల సంకల్పాన్ని ఆలోచించాలన్నారు. గెలవాలన్న ఆత్మవిశ్వాసాన్ని నింపుకోవాలన్నారు. మన ఉత్సాహాన్ని మించిన శక్తి ఏదీ లేదన్నారు. ఈ ప్రపంచంలో మనశక్తితో జయించలేనిది ఏదీ లేదన్నారు.

**ప్రజలను జాగృతం చేయాలంటూ క్రీడాకారులకు పిలుపు**

ఇదిలావుంటే దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో దానిని నివారించేందుకు క్రీడాకారులు ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. వివిధ రంగాల ప్రముఖులతో సమాలోచనలు జరుపుతున్న ప్రధాని తాజాగా శుక్రవారం ప్రముఖ క్రీడాకారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. . దీనిలో భాగంగానే బీసీసీఐ అధ్యక్షుడు, టీమిండియా మాజీ సారథి సౌరవ్ గంగూలీ, సచిన్ టెండుల్కర్, పివి సింధు తదితరులతో ప్రధాని మోడీ వీడియా కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వివిధ క్రీడలకు సంబంధించిన 40 మంది ప్రముఖులతో ప్రధాని చర్చించారు. వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా ప్రజల్లో చైతన్యం కలిగించేలా చూడాలన్నారు. ఇప్పటికే కరోనా నివారణ కార్యక్రమంలో క్రీడాకారులను కూడా భాగస్వామ్యులను చేయాలని కేంద్ర భావిస్తోన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగానే వైరస్ వ్యాప్తి నియంత్రణకు ప్రజలను చైతన్య పరచాలని ప్రధాని వారిని కోరారు. కాగా దేశవ్యాప్త లాక్ డౌన్ కారణంగా సెలబ్రిటీలంతా ఇళ్లకే పరిమితం కావడంతో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్న విషయం తెలిసిందే. ఇక కరోనాపై పోరుకు పెద్ద ఎత్తున విరాళాలు అందించిన క్రీడా, సినీ ప్రముఖులను మోడీ ఇదివరకే అభినందించారు.

# ప్రపంచ బ్యాంక్ భారీ మొత్తంలో కరోనా సాయం

**భారత్‌కు బిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీ**

**25 దేశాలకు 1.9 బిలియన్ డాలర్ల మొత్తం ప్రకటన**

వాషింగ్టన్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): కరోనాను ఎదుర్కొనేందుకు ప్రపంచ బ్యాంక్ పలు దేశాలకు ఆర్థికసాయం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కోవిడ్–19 నిర్మూలనకు గాను ప్రపంచ బ్యాంక్ నిధులను కేటాయించింది. కరోనా కారణంగా ఏర్పడిన ఆర్థిక కష్టాలను ఎదుర్కొనేందుకు ప్రపంచబ్యాంకు భారత్‌కు బిలియన్ డాలర్ల అత్యవసర సాయాన్ని ప్రకటించింది. మొత్తం 25 అభివృద్ధి చెందుతున్న దేశాలకు 1.9 బిలియన్ డాలర్ల సాయం ప్రకటించిన ప్రపంచబ్యాంకు అందులో ఒక బిలియన్ డాలర్లను భారత్‌కు కేటాయించినట్లు ప్రపంచబ్యాంకు గ్రూప్ అధ్యక్షుడు డేవిడ్ మాల్‌పాస్ తెలిపారు. కరోనా సంక్షోభం నుంచి త్వరగా కోలుకొనేందుకు ఈ సహాయం ప్రకటించినట్లు వెల్లడించారు. ప్రస్తుత సమస్య పేద దేశాలకు చాలా క్లిష్టమైనదని తెలిపారు. 25 దేశాలకు 1.9 బిలియన్ డాలర్ల సాయం ప్రకటించింది. ఈ అత్యవసర ఆర్థికసాయంలో అత్యధికంగా భారత్‌కు 1 బిలియన్ డాలర్లను కేటాయిస్తూ గురువారం నాడు జరిగిన బోర్డ్ ఆఫ్ ఎక్స్‌గ్యూటివ్ డైరెక్టర్స్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. స్క్రీనింగ్, కాంటాక్ట్ ట్రేసింగ్, లాబోరేటరీల ఏర్పాటు, డయాగ్నోస్టిక్స్, పీపీఈల కొనుగోలు, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుకు నిధులను వినియోగించనున్నారు. మహమ్మారి కరోనాపై పోరుకు ప్రపంచ బ్యాంకు భారత్‌కు ఒక బిలియన్ డాలర్ల సాయం అంటే సుమారు రూ.7,600 కోట్లు అత్యవసర సాయం ప్రకటించింది. ఈమేరకు భారత్ చేసిన అభ్యర్థనపై వరల్డ్ బ్యాంకు నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్‌కు 200 మిలియన్ డాలర్లు, ఆఫ్ఘనిస్థాన్‌కు 100 మిలియన్ డాలర్లు, మాల్దీవులకు 7.3 మిలియన్ డాలర్లు, శ్రీలంకకు 128.6 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. అదేవిధంగా ఆర్థిక వ్యవస్థ పురోగతికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రానున్న 15 నెలల్లో 160 బిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీపై ప్రపంచబ్యాంక్ కసరత్తులు చేస్తుంది. ఈ మొత్తాన్ని దారిద్య్ర నిర్మూలనపై, నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వెచ్చించనున్నట్లు పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ పురోగతికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రానున్న15 నెలల్లో 160 బిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీపై ప్రణాళికలు వేస్తున్నామని ప్రపంచ బ్యాంకు తెలిపింది. ఈ మొత్తాన్ని దారిద్య్ర నిర్మూలనపై, నిరుపేదలను ఆదుకునేందుకు, పర్యావరణ పరిరక్షణకు ఖర్చు చేస్తామని పేర్కొంది.

# కోలుకున్న ప్రిన్స్ ఛార్లెస్

**ఫోన్ ద్వారా పరామర్శించిన ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్రిటన్ యువరాజు ప్రిన్స్ చార్లెస్‌కు ఫోన్ చేసి మాట్లాడారు.

గత నెలలో కరోనా వైరస్ బారిన పడిన ప్రిన్స్ తన సతీమణితో కలిసి స్వచ్ఛంద ఐసోలేషన్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. ఇటీవలే తాను కోలుకున్నట్టు ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఆయనకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల్లో కోవిడ్–19పై నెలకొన్న పరిస్థితులు వీరి మధ్య చర్చకు వచ్చాయి. గత కొద్ది రోజులుగా బ్రిటన్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడంపై ప్రధాని సంతాపం తెలిపారు. ప్రిన్స్ కోలుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ.. ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలని ఆకాంక్షించారు. కాగా యూకేలోని భారతీయులపై ప్రిన్స్ చార్లెస్ ఈ సందర్భంగా ప్రశంసలు కురిపించారు. నేషనల్ హెల్త్ సర్వీస్‌లో పనిచేస్తున్న అనేక మంది భారతీయులు కరోనా మహమ్మారిపై సమర్థంగా పోరాడుతున్నారంటూ ఆయన కొనియాడారు. బ్రిటన్‌లో భారతీయులకు చెందిన పలు మత సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న నిస్వార్థ సేవలను కూడా ప్రిన్స్ చా÷–ల్గ÷స్ ప్రస్తావించారు. కాగా కరోనా వైరస్ కారణంగా భారత్‌లో చిక్కుకున్న బ్రిటన్ పౌరులకు భారత ప్రభుత్వం అందిస్తున్న సాయంపై ప్రధాని మోదీకి ప్రిన్స్ ధన్యవాదాలు తెలిపారు.

# పోలీసులను అడ్డుకుంటే కేసులు

**యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటన**



లక్నో,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): పోలీసులపై ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే జాతీయ భద్రతా చట్టం కింద కేసులు నమోదు చేస్తామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ప్రకటించారు. కరోనా వైరస్ కట్టడికి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతుండటంతో పోలీసులు అనునిత్యం విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వివిధ కారణాలతో రోడ్లపైకి వస్తున్న ప్రజలను వారు అడ్డుకుంటున్నారు. దీంతో వారిపై ప్రజలు తిరుగబడు తున్నారు. ఇలాంటి ఘటనలను నివారించడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈమేరకునిర్ణయం తీసుకున్నది. వైద్యసిబ్బందిపై తరచూ దాడులు జరుగుతుండటంతో మధ్యప్రభుత్వం కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకున్నది. దేశంలో ఇప్పటివరకు 2300లకుపైగా కరోనా కేసులు నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా 10లక్షలకు పైగా జనాభా ఈ మహమ్మారి బారినపడగా, 50వేల మందికిపైగా మరణించారు.

జమాత్ కార్యకర్తలను పట్టుకున పోలీసులకు రివార్డు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాంపూర్ నుంచి రుద్రాపూర్ వచ్చిన తబ్లిగ్ జమాత్ కార్యకర్తలు 13 మందిని పట్టుకున్న పోలీసు బృందానికి రూ.20వేల రివార్డును ఉత్తరాఖండ్ పోలీసు డైరెక్టర్ జనరల్ ప్రకటించారు. మొరాదాబాద్ జమాత్ సమావేశంలో పాల్గొని రుద్రాపూర్ వచ్చిన 13 మంది తబ్లిగ్ జమాత్ కార్యకర్తలను పోలీసులు పట్టుకొని వారిని క్వారంటైన్ చేశారు. 13 మంది జమాత్ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేసి, వారిని 14 రోజుల పాటు క్వారంటైన్ కు తరలించామని వైద్యాధికారులు చెప్పారు. కరోనా వైరస్ ప్రబలకుండా జమాత్ కార్యకర్తలను పట్టుకున్న పోలీసు బృందాన్ని డీజీపీ అశోక్ కుమార్ అభినందించారు.

# తెలంగాణలో 154కు చేరిన కరోనా కేసులు

**మర్కజ్ వెళ్లొచ్చిన వారికి పరీక్షలు**

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా కేసులు భారీగా నమోదవుతున్నాయి. గడిచిన రెండు రోజుల్లో 57 మందికి వైరస్ పాజిటివ్ వచ్చింది. అయితే శుక్రవారం రోజున మళ్లీ కరోనా కేసులు పెరిగాయి. రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 154కు చేరింది. ఇదిలా ఉంటే.. ఇప్పటి వరకూ తెలంగాణలో 9 మంది కరోనాతో మృతి చెందారు. మరోవైపు మర్కజ్ వెళ్లొచ్చిన 900 మందిని అధికారులు గుర్తించారు. రెండు రోజుల్లో మొత్తం 800 మందికి కరోనా పరీక్షలు చేశారు. అయితే.. మర్కజ్ వెళ్లొచ్చిన వారికి క్వారంటైన్ ముద్ర వేశామని అధికారులు తెలిపారు. ఇందులో 14 మంది ఇప్పటికే కోలుకుని ఇంటికెళ్లిపోగా, గురువారం మరో ముగ్గురిని డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. తెలంగాణలో లాక్ డౌన్‌ను శుక్రవారం నుంచి మరింత కఠినంగా అమలు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు రోడ్ల మీదికి వస్తున్న అనుమానాస్పద వాహనదారులను వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఇకపై ట్రాఫిక్ చలానాతో పాటు వాహనదారులను స్థానిక పోలీసులకు అప్పగిస్తారు. స్థానిక పోలీసులు వాళ్లపై ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపనున్నారు. పోలీసులకు చిక్కితే గరిష్టంగా రెండేళ్లు జైల్ శిక్ష పడే అవకాశం ఉంది. తెలంగాణలో ఇప్పటి వరకు 25 వేల లాక్ డౌన్ కేసులు నమోదవ్వగా.. 34 వేల వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఇవాల్టి నుంచి కారణం లేకుండా ఎవరైనా బయటకు వస్తే వారి వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు పట్టుబడ్డ వ్యక్తులు నేరుగా జైలుకే వెళ్లాల్సి ఉంటుంది. ఐపీసీ సెక్షన్ 188, 271, 188, ప్రాణనీతక వ్యాధులు, ప్రాణాలకు ముప్పు, క్వారంటైన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం అంశాలపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

# మర్కజ్ వెళ్లొచ్చిన వారిలో 80శాతం మంది గుర్తింపు

**వీధి కుక్కలకు ఆహారం పంపిణీ: మేయర్**

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నుంచి మర్కజ్ వెళ్లొచ్చిన వారి వివరాలు సేకరిస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. మర్కజ్ వెళ్లొచ్చిన వారిలో ఇప్పటికే 80 శాతం మందిని గుర్తించామని ఆయన పేర్కొన్నారు. మిగతా వారు కూడా వైద్య సిబ్బందికి సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. ఎంటమాలజీ విభాగం ద్వారా వీధి కుక్కలకు ఆహారం అందిస్తామని చెప్పారు. 1500 మంది యాచకులకు భోజనం అందిస్తున్నామని మేయర్ తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు రవాణా వసతి కల్పిస్తున్నామన్నారు. భౌతిక దూరం పాటిస్తూ ఎస్ఆర్‌డీపీ పనులు సాగుతున్నాయని బొంతు రామ్మోహన్ స్పష్టం చేశారు.

# వైద్యసిబ్బందిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు ఎంపీ కేవీపీ సూచన

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి కరోనా వైరస్ రోగులకు సేవలందిస్తున్న వైద్యసిబ్బందిపై దాడులను ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కేవీపీ రామచంద్రరావు చెప్పారు. వైద్యసిబ్బంది, ఆస్పత్రులపై దాడులకు వ్యతిరేకంగా దేశంలోనే తొలిసారిగా ఉమ్మడి ఏపీ 2007లో చట్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేసిన ఆ చట్టాన్ని వెంటనే అమలులోకి తేవాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు కేవీపీ సూచించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కేవీపీ కోరారు. ఇలాంటి ఆపత్కాల సమయంలో అందరి క్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించే మార్గదర్శకాలను, విధించే ఆంక్షలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆదేశాల మేరకు కష్టాల్లో ఉన్నవారికి పార్టీ కార్యకర్తలు సాయమందించాలని ఆయన సూచించారు.

# పౌరసరఫరాల శాఖ అప్రమత్తం


**నిత్యాసవర ధరల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్**

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): నిత్యావసర సరుకుల ధరల పర్యవేక్షణ, వినియోగదారుల ఫిర్యాదులకు సహాయం, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణ పౌరసరఫరాలశాఖ ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేసింది. సోమాజీగూడలోని ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కు నేరుగా ప్రజలు ఫోన్‌చేసి ఫిర్యాదులు చేయవచ్చు. తెలంగాణ లాక్‌డౌన్ నేపద్యంలో కొందరు వ్యాపారులు నిత్యావసర వస్తువుల ధరలు పెంచే వినియోగదారులను దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేసింది. పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేశారు. 24గంటల పాటు ఇది పనిచేస్తుంది. వినియోగ దారులు తమ ప్రాంతాల్లో వ్యాపారులు ధరలను పెంచి అమ్మతే నేరుగా 040–23336116 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అలాగే కంట్రోల్ రూమ్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నిత్యావసర సరుకులు రవాణా చేస్తున్న వాహనాల వివరాలను కూడా నమోదుచేస్తుంది. ఎల్‌పీపీ, నిత్యావసర సరుకుల నిల్వలను కూడా ప్రతి రోజూ సమీక్షిస్తుంది. కంట్రోల్ రూమ్‌కి వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకునే విధంగా తెలంగాణ పౌరసరఫరాల సంస్థ చర్యలు తీసుకుంటుంది.

## చరిత్రలో నేటినిజం

కం॥ తన ప్రాంతపు టభివృద్ధికి
తన జన కల్యాణమునకు తపాతపాలాడున్
"కనుమూరు బాపిరాజు"కు
మననీయునిగా నిడెద నమస్కారంబుల్ !!

(ఏప్రిల్ 4 కనుమూరు బాపిరాజు జననం) -రాధశ్రీ



సెల్: 9494481210

# 50వేలు దాటిన కరోనా మృతులు

**జాన్స్ హాప్కిన్స్ వర్సిటీ వెల్లడి**

వాషింగ్టన్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా నోవెల్ కరోనా వైరస్ వల్ల మృతిచెందిన వారి సంఖ్య 50 వేలు దాటింది. అమెరికాకు చెందిన జాన్స్ హాప్కిన్స్ వర్సిటీ ఈ విషయాన్ని చెప్పింది. కోవిడ్19 వల్ల 50,230 మంది మృతిచెందినట్లు రీసర్చ్ యూనివర్సిటీ పేర్కొన్నది. గత ఏడాది డిసెంబర్‌లో తొలిసారి వుహాన్‌లో కరోనా కేసులు బయటపడ్డాయి. మరోవైపు వైరస్ సంక్రమించిన వారి సంఖ్య పది లక్షలు దాటినట్లు అధికారులు చెబుతున్నారు. నోవెల్ కరోనా వల్ల అత్యధికంగా ఇటలీ నష్టపోయింది. ఆ దేశంలో సుమారు 13,915 మంది మరణించారు. స్పెయిన్‌లో సుమారు 10వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మూడవ స్థానంలో అమెరికా ఉన్నది. ఆ దేశంలో ఇప్పటి వరకు 5316 మంది మరణించినట్లు తెలుస్తోంది.

అగ్రరాజ్యం అమెరికా కోవిడ్–19 ధాటికి వణికిపోతోంది. కరోనా వైరస్ కారణంగా 33 కోట్ల మంది జనాభా ఉన్న అమెరికాలో గత నెల రోజులుగా సుమారు 27 కోట్ల మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వైరస్ సోకిన వారికి చికిత్స అందించేందుకు అవసరమైన అత్యవసర ఔషధాలు, వైద్య సామగ్రికి కొరత ఏర్పడింది. కరోనా కారణంగా ఇప్పటి వరకు మృతిచెందిన వారి సంఖ్య 6వేలు దాటింది. ఇప్పటివరకు 2,42,182 కోవిడ్–19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 9,228 మంది వ్యాధి నుంచి కోలుకున్నారు. ప్రపంచంలోనే అత్యధిక కరోనా కేసులు అమెరికాలోనే నమోదయ్యాయి. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 30 వరకు సామాజిక దూరం పాటించాలంటూ మార్గదర్శకాలు జారీ చేశారు.

# మద్యప్రియులకు కేరళ హైకోర్టు షాక్

**డాక్టర్ సర్టిఫికెట్‌పై సరఫరాపై స్టే**

తిరువనంతపురం,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ సందర్భంగా మద్యపానానికి బానిసైన వారికి మద్యం సరఫరా చేయాలంటూ కేరళ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆ రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. ఆల్కహాల్ విత్‌డ్రాల్ సిండ్రోమ్ ఉన్నట్టు మెడికల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న మద్యం బానిసలకు లిక్కర్ సరఫరా చేసేలా ప్రభుత్వం ఇటీవల ఏర్పాట్లు చేసింది. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ టీఎన్ ప్రతాపన్, కేరళ ప్రభుత్వ వైద్య అధికారుల సంఘం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఏకే జయశంకరన్ నంబియార్, జస్టిస్ షాజీ పి చలేలతో కూడిన డివిజన్ బెంచ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టింది. మద్యానికి బానిసైన వారికి శాస్త్రీయంగా చికిత్స జరగాలనీ.. వీరికి ఏ వైద్యుడూ మద్యం తాగమని సూచించలేరని వైద్యాధికారుల సంఘం వాదించింది. అలాంటివారికి మద్యం అందించడం వైద్య శాస్త్రానికి విరుద్ధమని స్పష్టం చేసింది. మరోవైపు ప్రభుత్వం తరపున రాష్ట్ర అటార్నీ జనరల్ కేవీ సోహాన్ వాదనలు వినిపిస్తూ... ఆల్కహాల్ విత్‌డ్రాల్ చికిత్సలో భాగంగా కొద్ది మోతాదులో మద్యం తీసుకోవడం ఎప్పటినుంచో ఉన్నదేనని పేర్కొన్నారు. అయితే ఈ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. మద్యపాన బానిసలకు మితమైన మోతాదులో లిక్కర్ అందించాలని వైద్య శాస్త్రంలో ఎక్కడా లేదని స్పష్టం చేసింది. అధిక మొత్తంలో ఆల్కహాల్ సేవించే ఓ వ్యక్తి ఉన్నపళంగా దాన్ని నిలిపి వేయడం ద్వారా బయటపడే లక్షణాలను ఆల్కహాల్ విత్‌డ్రాల్ సిండ్రోమ్ అంటారు.

# అమెరికాలో 5850కి చేరిన మరణాలు

**ట్రంప్‌కు రెండోసారి కరోనా పరీక్షలు**

వాషింగ్టన్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): అగ్రరాజ్యం అమెరికాలో కరోనా వైరస్‌తో మరణించిన వారి సంఖ్య 5,850 మందికి చేరింది. గత 24 గంటల్లో 884 మంది మరణించారు. దీంతో కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో అలసత్వం ప్రదర్శించిన ఇటలీ, స్పెయిన్ సరసన అమెరికా చేరింది. ఈ మూడు దేశాలు మృతుల సంఖ్యలో కరోనా వైరస్ పుట్టిన చైనాను ఎప్పుడో అధిగమించాయి. అదేవిధంగా కరోనా కేసుల సంఖ్యలో కూడా అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఇప్పటి వరకు ఆ దేశంలో 2,42,182 కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదకరమైన వైరస్ అమెరికా ఆర్థికవ్యవస్థపై కూడా పెను ప్రభావం చూపుతున్నది. ఇప్పటికే ఆ దేశంలో రవాణాతో సహా అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో తమకు నిరుద్యోగ ప్రయోజనాలు చెల్లించాలని 6.6 మిలియన్ల అమెరికన్లు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు.

ట్రంప్‌కు రెండోసారి పరీక్షలు

అమెరికా దేశంలో కరోనా వైరస్ వేగంగా ప్రబలుతున్న నేపథ్యంలో ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు వైద్యులు రెండోసారి కరోనా పరీక్ష చేశారు. ఈ కరోనా పరీక్షల్లో ట్రంప్ కు కరోనా నెగిటివ్ అని వచ్చింది. ఉదయం అధ్యక్షుడు ట్రంప్‌కు కొత్త ర్యాపిడ్ పాయింట్ కేర్ సహాయంతో ఒక్క నిమిషంలోనే శాబ్స్ శాంపిల్ కలెక్షన్ చేసి మళ్లీ కొవిడ్–19 పరీక్ష చేశాం, పరీక్ష ఫలితం 15 నిమిషాల ముందే వచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంగా ఉన్నారు, ఆయనకు ఎలాంటి కరోనా లక్షణాలు లేవని వైట్ హౌస్ ఫిజీషియన్ డాక్టర్ సీన్ కాన్లీ చెప్పారు. అధ్యక్షుడు ట్రంప్ కు రెండోసారి జరిపిన పరీక్షల్లో కరోనా నెగిటివ్ అని పరీక్షల్లో వచ్చిందని వైట్ హౌస్ ప్రతినిధి ప్రకటించారు. అమెరికాలో కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ట్రంప్ సర్కారు ఆసుపత్రులకు కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆసుపత్రులకు సందర్శకులను అనుమతించవద్దని సర్కారు ఆదేశించింది. అమెరికాలో ఇప్పటికే 2,42,182 మందికి కరోనా వైరస్ సోకగా, 5,850 మంది దీనివల్ల మరణించారు

# కేటీఆర్‌ని కలిసి రూ.50 లక్షల చెక్ అందించిన బాలకృష్ణ



హైదరాబాద్, ఏప్రిల్ 3:కరోనా సహాయక చర్యల కోసం నందమూరి బాలకృష్ణ తన వంతు బాధ్యతగా రూ.1 కోటి 25 లక్షల రూపాయల విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ.. కొద్ది సేపటి క్రితం మంత్రి కేటీఆర్‌ని కలిసి తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్ కి 50 లక్షల రూపాయల చెక్ ను అందించారు. ఆ సమయంలో బాలకృష్ణతో పాటు అతని అల్లుడు తదితరులు ఉన్నారు.ఇక ఈ రోజు ఉదయం లాక్ డౌన్ కారణంగా ఎంతో ఇబ్బంది పడుతున్న తెలుగు సినీ కార్మికుల సహాయార్థం 25 లక్షల రూపాయలని కరోనా క్రైసిస్ ఛారిటీ(సిసిసి) ఎగ్జిగ్యూటివ్ మెంబర్ సి కళ్యాణ్‌కి అందించారు బాలకృష్ణ. కరోనాపై పోరాటానికి తన వంతు బాధ్యతగా ఈ విరాళాన్నిఅందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ విపత్తు సమయంలో ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటిస్తూ, కరోనాని అరికట్టడంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. సంక్షోభంలో ఉన్న ప్రతి సమయంలో బాలకృష్ణ తన పెద్ద మనసు చాటుకోవడాన్ని చిరు అభినందించారు. కాగా, ఆంధ్రప్రదేశ్ సీఎం సహాయనిధికి బాలకృష్ణ రూ.50 లక్షలు ప్రకటించిన విషయం విదితమే

